తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ. జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
మంగళవారం
2 జూన్ 2026
పేజీలు - 8



## అడవులను రక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి) : అడవులను రక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే 99 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అడవులను రక్షించడం, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని బాధ్యతగా కాపాడటం వంటి పనులను ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. తద్వారా జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక ప్రణాళికలో ముఖ్యంగా జల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరుగుతుందని, నీటి వృథాను అరికట్టి, ప్రతి నీటి బొట్టును అత్యంత విలువైనదిగా భావించి పొదుపు చేయాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ రహిత జీవితాన్ని అలవర్చుకోవడంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, రీసైక్లింగ్ పద్ధతులను పాటించాలని సూచించారు. భూమిపై ఉన్న ప్రతి జీవిని రక్షిస్తూ జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం మనందరి ప్రాథమిక కర్తవ్యమని గుర్తుచేశారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను అదుపు చేయడానికి కార్బన్ ఉద్గారాలను తగ్గించి మన భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. "పచ్చదనం పెంచుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో సాగుతున్న ఈ 99 రోజుల సుదీర్ఘ కార్యాచరణలో జిల్లా ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున భాగస్వాములు అయి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మిగతా 9లో..

# ముగిసిన సరస్వతి పుష్కరాలు

- ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు

కాళేశ్వరం, జూన్ 2 (జనం సాక్షి) : సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా చివరి రోజు అయిన సోమవారం పరంపర ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం సరస్వతీ మాత వేదిక పైనుంచి పండితులు పేద ఆశీర్వచనం చేశారు . సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా ముగింపుకు ముఖ్య అతిథిలుగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత ఆది పుష్కరాలు, ఇప్పటి అంత్య పుష్కరాలు విజయవంతంగా నిర్వహించుకున్నామని తెలిపారు. అధికార యంత్రాంగం అద్భుతమైన ఏర్పాట్లు చేసిందని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక జి ఓ ద్వారా 200 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు నమ్మికతో ఈ కాళేశ్వరం దర్శనానికి వస్తుంటారని, సరస్వతి పుష్కరాలు మొట్టమొదటి సారి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. గత ఏ ప్రభుత్వంలో జరగని విధంగా ఈ పుష్కరాలు నిర్వహించామని హర్షం వ్యక్తం చేశారు. అందరికి మంచి జరగాలని కాశీ పండితులచే హారతి నిర్వహించామని అలాగే సరస్వతి మాతను, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానంలో చివరి రోజు అంగరంగ వైభవంగా కార్యక్రమాలు జరిగాయని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చొరవకు ధన్యవాదాలు.







పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన అధికారులకు ధన్యవాదాలు. ఈ క్షేత్రం ఇంకా అభివృద్ధి చెందాలని కోరుతున్నానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విప్ విజయ రమణ రావు మాట్లాడుతూ గత ఆది పుష్కరాలు, ఇప్పటి అంత్య పుష్కరాల లు విజయవంతంగా నిర్వహించుకున్నాం. మిగతా 9లో..




## చిన్నారులను తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీలది కీలక పాత్ర

- రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు
- గోలేటిలో 'అమ్మ మాట అంగన్వాడి బాట'

రెబ్బెన, జూన్ 1 (జనంసాక్షి) : చిన్నారులను తీర్చిద్దిడంలో అంగన్‌వాడీలది కీలక పాత్ర వహిస్తున్నాయని రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు అన్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం-4లో రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావులు 'అమ్మ మాట - అంగన్వాడి బాట' కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

వార్త మెయిన్ 3లో






## ప్రేమతో వలవేసి.. పెళ్లంటే ప్లేట్ ఫిరాయించాడు..!

- నమ్మించి నట్టేట ముంచిన ప్రియుడిపై యువతి 'రణభేరి'

వార్త మెయిన్ 7లో






# ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సర్పంచ్



**చిట్యాల, జూన్ 01 :** మండ లంలోని కైలాపూర్ గ్రామంలో సోమవారం నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సర్పంచ్ కొడారి ఓదెలు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోం దన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు శాశ్వత గృహాలు అందను న్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియో గం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకొని ప్రభుత్వ సహాయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి,హౌసింగ్ ఏఈ సౌమ్య, పంచాయతీకార్యదర్శి అజీరా బేగం, ఉప సర్పంచ్ చింతల లక్ష్మీ-సదానందం, వార్డు సభ్యులు తాత సమ్మక్క, చింతల రాజమౌళి, రమేష్, వేముల కావ్యా-హరీష్, అన్న రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలి

### ఎమ్మార్పి ఎస్ మండల అధ్యక్షులు యాసం రమేష్



**నూగూర్ వెంకటాపురం జూన్ 1(జనం సాక్షి ):-** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ను ఏర్పాటు చేయాలని మండల డిప్యూటీ తహసీల్దార్ కి ఎమ్మార్పిఏ స్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పిఏస్ మండల అధ్యక్షులు యాసం రమేష్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతలైన వెంకటాపురం, వాజేడు మండలాలకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలనీ అన్నారు. వెంకటాపురం లో ఎస్సి సంక్షేమ వసతి గృహాలు మూసి వేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత విద్యార్థులకు చదువు కోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దళిత విద్యార్థుల ఆవేదనని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నామని అన్నారు. దళితుసామజిక వర్గం అత్యంత వెనకబడి ఉండటం తో విద్య కోసం దూర ప్రాంతాలకి విద్యార్థులను పంపించలేని పరిస్థితి ఉందని అన్నారు. విద్యార్థులు విద్య మధ్యలో ఆపివేసి కూలీలుగా, మారి పోతున్నారని అన్నారు. విద్యాభివృద్ధి కోసం ఏజెన్సీ లో ఎస్సి సంక్షేమ గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని అయన అన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లేష్, చిన్న తిరుపతి, ఆనంద్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకోవాలి

**సారంగాపూర్,జూన్1(జనం సాక్షి)** "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" (అటవీ శాఖ ఆధ్వర్యంలో) గండి రామన్న అర్బన్ పార్క్, చించోలి నందు సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఐ. ఎఫ్. ఎస్. జిల్లా అటవీ శాఖ అధికారి, అధ్యక్షతన ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాలు జూన్ ఒకటవ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలోని అన్ని అటవీ రేంజ్ పరిధిలో బైక్ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, బర్డ్ వాచింగ్,విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీల నిర్వహణ, వన దర్శిని, ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు, కళాజాత కార్యక్రమాలు, బైక్ ర్యాలీ, ప్లాస్టిక్ నివారణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీ అర్జుమన్ అలీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్, శ్రీ అప్పల గణేష్ చక్రవర్తి వైస్ చైర్మన్ నిర్మల్ మున్సిపాలిటీ, భీమ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మెన్ నిర్మల్, అబ్దుల్ హాది మార్కెట్ కమిటీ చైర్మెన్ సారంగాపూర్, శ్రీ షిండే ఆనంద్ రావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మెన్ బైంసా, శ్రీ కళ్యాణ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ కుబీర్, శ్రీమతి షేక్ ఆదం నాగిని భాను అటవీ మండలాధికారి నిర్మల్, శ్రీ కే శివకుమార్ అటవీ మండలాధికారి ఖానాపూర్ మరియు అటవీనిఘా విభాగం బాసర సర్కిల్ , ఇమ్రాన్ ఉల్లా, షేక్ ఇర్ఫాన్, జాకీర్ అహ్మద్, రాజు, సాదం అరవింద్, అర్జున్, నరేష్, ముత్యం, నరేందర్ కౌన్సిలర్లు, జీ వి రామకృష్ణారావు ఎఫ్ఆర్ఓ నిర్మల్, రాథోడ్ రమేష్, శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, కల్పనా దేవి, శ్రీనివాస్ రెడ్డి, గీతారాణి, వాణి అటవీ క్షేత్ర అధికారులు, నజీర్ ఖాన్, రాజశేఖర్ డిప్యూటీఆర్ఓలు, జిల్లా అటవీ సిబ్బంది, విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# ప్రజావాణిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 01(జనం సాక్షి):**మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, అదనపు కలెక్టర్ (ఇంచార్జ్ స్థానిక సంస్థల) పురుషోత్తం పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా వినతులను స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్ మరియు (ఇంచార్జ్) పురుషోత్తం పర్యవేక్షణలో, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 02న జరుపు తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, వచ్చిన అతిథులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మంచినీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారుప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, మరియు వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వినతులు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రజావాణి కార్యక్రమం ల మొత్తం ( 142 ) దరఖాస్తులు వచ్చాయి. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన సమైక్యలో జరిగిన అవినీతిపై మరియు నిధుల రికవరీ కోసం గిరిజన సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. మరిపెడ మండలం,



వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకన్న, పాకాల చెరువు వేలంపాట నిధుల అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. బగ్గంపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తన ఇంటి ముందున్న విద్యుత్ స్తంభం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, దానిని తొలగించాలని విన్నవించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. కమలాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాల అంతిమ సంస్కారాల కోసం ప్రత్యేక వసతుల ఏర్పాటు



**హనుమకొండ ప్రతినిధి జూన్ 1 జనం సాక్షి:** సుదూర ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం హనుమకొండ మహానగరానికి వచ్చి కిరాయి ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోయిన సమయంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమస్యను గుర్తించిన అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ అనిత రెడ్డి విషయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా చైర్మన్ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంబంధిత అధికారులతో కలిసి పద్మాక్షి శివ ముక్తి ధామ్ స్థలాన్ని పరిశీలించారు. నిరుపేదలు, వలస కార్మిక కుటుంబాలు తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. పుల్లూరి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ప్రముఖ సామాజిక సేవావేత్త అనిత రెడ్డి, పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొని తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ వసతులు అందుబాటులోకి వస్తే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుందని, తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విధి నిర్వహణ రాణిస్తే గుర్తింపు, రివార్డులు వస్తాయి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ బ్యూరో, జూన్ 01 (జనం సాక్షి)**విధి నిర్వహణలో రాణించే సిబ్బంది శాఖపరమైన గుర్తింపుతో పాటు రివార్డులు వస్తాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బంది సూచించారు. వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో పోలీస్ సిబ్బంది శాఖపరమైన సమస్యలపై పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన దర్బార్ కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముందుగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నీజాయితోతో పనిచేయాలని, శిక్షణ సమయంలో నేర్చుకున్నదే కోనసాగించాలని, ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులని, కావున పోలీసులు చేసే ప్రతి పని ప్రజలు గమనిస్తారని, అదే విధంగా ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం అధికంగా వుందని. దీని కారణంగా పోలీసులు తప్పు చేసిన, చేయకున్న సోషల్ మీడియా ద్వారా పోలీసుల వ్యతిరేకంగా ప్రచారం జరుగుతుందని. ఇది దృష్టిలో వుంచుకోని ప్రతి పోలీస్ అధికారి జాగ్రత్తగా పనిచేయాలని. నిరంతరం కష్టపడి విధులు నిర్వర్తించడమే కాకుండా చేసే విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని లేకుంటే ప్రజల్లో పోలీసుల పట్ల తప్పుడు సంకేతాలు పోతాయని. మీకు ఎదైన



శాఖపరమైన లేక వ్యక్తిగత సమస్యలు వుంటే తన దృష్టి రావాలని, వీలైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతం ఖైదీల ఎస్కాట్, ఇంక్రీమెంట్లు, విశ్రాంతి గదులుతో పాటు పలు శాఖపరమైన సమస్యలు పోలీస్ సిబ్బంది పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుక వెళ్ళారు. ఈ సమావేశంలో అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్,ఏసిపి నాగయ్య, అంతయ్య, సురేంద్ర,పరిపాలధికారి సంపత్ కుమార్ ఆర్.ఐలు సర్వర్జన్ రాజ్, సతీష్,శ్రీధర్, చంద్రశేకర్, సూపరింటెండెంట్లు యాకుబ్ బాబా, సంధ్య, వహిద్ పాషా, గిరితో పాటు ఆర్.ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# ముగిసిన సరస్వతీ అంత్య పుష్కరాలు



**కాళేశ్వరం , జూన్ 2 , ( జనం సాక్షి).** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం లో సరస్వతి అంత్య పుష్కరాలు ముగిసాయి. బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కొక్క నదికి పుష్కరం వస్తుంది. బృహస్పతి ఆ రాశిలో ఉన్నంతవరకు ఆ నదికి పుష్కరం ఉన్నట్టే. పుష్కర కాలము సాధారణంగా ఒక సంవత్సరం కాలం పాటు ఉంటుంది. పుష్కర కాలంలోని మొదటి 12 రోజులు ఆది పుష్కరమని చివరి 12 రోజులు అంత్యపుష్కరమని వ్యవహరిస్తారు. ఈ మొదటి చివరి 12 రోజులు అత్యంత ప్రత్యేకమైనవి. బృహస్పతి మిధున రాశిలో ఉన్నందువల్ల సరస్వతి నది పుష్కరం వచ్చింది. జూన్ రెండు నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశిస్తున్నందువల్ల యమునా ననికి పుష్కరాలు ప్రారంభమవుతున్నాయి.సరస్వతి అంత్య పుష్కరాల చివరి రోజు మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ కాళేశ్వరంలో పర్యటించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సరస్వతి నది తీరంలో పుణ్యస్నానం ఆచరించి గోదావరి మాతకు చీర, పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకోగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘంబట్ల దినేష్ కాళేశ్వరంలో పర్యటించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సరస్వతి నది తీరంలో పుణ్యస్నానం ఆచరించి, అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. తదుపరి పార్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ శాఖ కమిషనర్ హనుమంతరావు , ఆర్ జె సి రామకృష్ణారావు , ఆలయ ఈ ఓ మహేష్ లు మంత్రులకు విడివిడిగా స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేసి సరస్వతీ మాత జ్ఞాపికలు అందించారు.దర్శనం అనంతరం మంత్రి వివేక్ మాట్లాడుతూ పుష్కరాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, ఈ పవిత్ర స్థలంలో ప్రజలందరు పుష్కర స్నానాలు ఆచరించారని తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసం దేవుని ఆశీర్వాదం అందరికీ లభించాలని ప్రార్థించారు. రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాలను వచ్చే సంవత్సరం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సంకల్పించిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం సుమారు రూ. 1000 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గోదావరి పరివాహక జిల్లాలలో విస్తృతంగా ఏర్పాట్లు చేయడంతో పాటు, గోదావరి ప్రవహిస్తున్న జిల్లాల్లో కూడా పుష్కరాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. దేవాలయం అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసారని తెలిపారు. అలాగే బాసర దేవాలయ అభివృద్ధికి 170 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ గోదావరి--ప్రాణహిత-- అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఎంతో పవిత్రమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు దేవుని ఆశీస్సులు అందరికీ లభించాలని కోరారు. ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పుష్కరాలు విజయవంతంగా నిర్వహించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాలను బాసర నుండి భద్రాచలం వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయడం పట్ల ముఖ్యమంత్రికి, మంత్రి శ్రీధర్ బాబు కి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ శాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని సరస్వతి అమ్మవారిని, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు . పుష్కరాల ముగింపు అయిన చివరి రోజు సోమవారం ఆలయంలో లఘు చండీ హోమము పూర్ణాహుతి నిర్వహించారు. ఈ పూర్ణాహుతిలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ ,దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవాదాయ శాఖ సలహాదారు గోవిందా హరి పాల్గొన్నారు. చివరి రోజు భక్తుల రద్దీ ఆదివారం కంటే తక్కువగా ఉంది. భక్తులు చివరి రోజు కావడంతో పవిత్ర త్రివేణి సంగమంలో స్నానమాచరించి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. ప్రముఖ కవి , సహస్రావధాని , పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ కూడా సరస్వతి పుష్కర స్నాన ఆచరించి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు.

# ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో గో టు విలేజీ ప్రోగ్రాం విజయవంతం చేయాలి



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 01 ( జనం సాక్షి) :**మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్ అవుట్స్ ని తగ్గించి , విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా మార్గనిర్దేశం చేసి అక్షరాస్యతను పెంపొం దించడం కోసం ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో మే 25 నుండి జులై 5 వరకు 40 రోజుల పాటు గో టు విలేజ్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని ఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనగామ జిల్లా ఇంచార్జీ బోడ సునీల్ మాదిగ అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రవేట్ హబ్ లో నియోజకవర్గం స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోడ సునీల్ మాదిగ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన సర్వే నివేదికలో అక్షరాస్యతలో తీవ్రంగా వెనుకబడిన కులంగా మాదిగలు ఉన్నా రని అన్నారు.అందువల్ల మాదిగలకు విద్యా యొక్క ప్రాముఖ్యతను వివరించి అక్షరాస్యతను పెంపొందించడం కోసం మంద కృష్ణ మాదిగ నిర్ణ యం తీసుకొని ప్రతిగ్రామాల్లో చైతన్య సమా వేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారని అన్నా రు. అందులో బాగంగానే గో టు విలేజ్ ప్రోగ్రాం చేపట్టినట్లు ఆర్థిక ఇబ్బందులూ, కుటుంబ సమ స్యలు మొదలగు ఇబ్బందుల వల్ల మాదిగలు చదువులకు దూరం కావద్దని అన్నారు. అత్యంత పేదరికంలో ఉన్న మాదిగలు అభివృద్ధిలోకి రావా లంటే చదువుఒక్కటే మార్గమని అన్నారు.ఉన్నత చదువుల కోసం అందుబాటులో ఉన్న అన్ని రకా ల మార్గాలను ఉపయోగించుకుందాం అని అన్నా రు. 30 ఏళ్లు పోరాటం చేసి సాధించిన వర్గీకరణ ఫలాలను అందుకొని ఉన్నత విద్యారంగంలో , ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ జాతి రాణించాలని పిలుపునిచ్చారు.మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న తెలిపారు. 32 వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీంద ర్ మాదిగ, విహెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు,ఎంఎస్పి జనగామజిల్లాఉపాధ్యక్షుడు నలిమెల నాగరాజు మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు గంగాధరి రవీందర్ మాదిగ, ఎమ్మెస్పీ జాఫర్ గడ్డ మండల అధ్యక్షుడు ఎంఎస్పి మండల అధ్యక్షుడు ఇల్లందుల రాంబాబుమాదిగ, లింగాల గణపురం మండల ఉపాధ్యక్షుడు నల్ల ఉపేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు కలకోట రాజ శేఖర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుని కార్డు ఇవ్వాలి

### తెలంగాణ ఉద్యమకారుడు మోతిలాల్ నాయక్

### వరంగల్ జిల్లా కలెక్టర్ కు వినతి



**వరంగల్ బ్యూరో, జూన్ 01 (జనం సాక్షి)** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న తనకు జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమ కారుని కార్డు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు మోతిలాల్ నాయక్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను కోరారు. ఈ మేరకు వరంగల్ కలెక్టర్ కార్యాలయం లోని గ్రీవెన్సో సోమవారం వినతిపత్రం సమర్పిం చారు. తాను 2001 నుంచి 2014 వరకు జరిగినటువంటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపాడు. తనపై 39 కేసులు పోలీసులు నమోదు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తాను తెలంగాణ ఉద్యమంలో తన ఇల్లు ఆస్తులు పోగొట్టుకు న్నానని, తన కారును కొందరు ధ్వంసం చేశారని దీనివల్ల కోట్లాది రూపాయల నష్టం తనకు వాకిలినట్లు మోతిలాల్ నాయక్ వివరించారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ గుర్తించలేదని కనీసం ఇప్పుడు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అయిన తనతో పాటు మిగతా ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూడాలని మోతిలాల్ నాయక్ ఈ సందర్భంగా కోరాడు. తెలంగాణ ఉద్యమం కోసం తాను నిరంతరం పాటుపడినట్లు వివరించారు.

# బిఎల్వోల గౌరవ వేతనం ఇప్పించండి



**వరంగల్ ఈస్ట్, జూన్ 01 ( జనం సాక్షి)** బూత్ లెవెల్ ఆఫీస ర్స్ (బి ఎల్ ఓ) కు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఇప్పించాలని కిలా వరంగల్ మండలం బిఎల్వో లంతా సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ ను కోరారు. తమకు 2023 నుండి రావలసిన వేతనం నేలకు వెయ్యి రూపాయలు చొప్పున ఇప్పటివరకు ఇవ్వలేదని, ఇటీవల కేవలం 2500 రూపాయలు ఇస్తామంటూ అనడం వల్ల తాము తీసుకోలేదని బిఎల్వోలు ఆవేదన వ్యక్తం చేశారు. అకౌంట్ పే ద్వారా డబ్బులు చెల్లించాలని ఈ సందర్భంగా కోరారు. గతంలో ఈ విషయాన్ని సంబంధిత తాసిల్దార్ కార్యాలయంలో అడగగా తమకు ఇంకా బడ్జెట్ రాలేదని అంటున్నట్లు బిఎల్వోలు తెలిపారు. ఇప్పటికైనా తమకు రావలసిన పూర్తి గౌరవ వేతనం ఇప్పించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో బిఎల్వోలు ఉష, స్వర్ణ, కవిత, సుజాత, రమ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ శ్లోక.. కాలని వాసుల ప్రశంస



**మహబూబాబాద్ , జూన్ 01(జనం సాక్షి):**మానుకోట మున్సి పాలిటీ 19వ వార్డు, హైమ గార్డెన్లో నివాసముంటున్న గోట్ల రాకేష్ యాదవ్ - శ్వేత దంపతుల కూతురు శ్లోక(4) ప్రతి రోజూ మున్సిపాలిటీ ట్రాక్టర్ వద్దకు వెళ్లి మున్సిపల్ సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేరుచేసిన రెండు వేర్వేరు డబ్బాలలో అందచేస్తుంది. అది గమనించిన కాలనీ వాసులు శభాష్ శ్లోక అంటూ ప్రశంసిస్తున్నారు. ఇలాంటి చిన్న చర్యలు పెద్ద మార్పు తీసుకొస్తాయని, పర్యావరణం సమతుల్యం కోసం 100 రోజుల ప్రజాపాలన, ముఖ్యంగా చెట్లను పెంచడం వలన పర్యావరణం కాపాడవచ్చు అని, అదేవిధంగా చిన్నపిల్లలకు పర్యావరణ పరిరక్షణ, పరిసరాల శుభ్రత ఇంత త్వరగా అవగాహన కలగటం ప్రభుత్వాలు పాలనకు ప్రజలతో మమేకమే ఇది నిదర్శనం అని కాలని వాసులు తెలిపారు.

# వెంకటాపురం మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వికరించిన బొగ్గ నారాయణ...



**నూగూర్ వెంకటాపురం 1(జనం సాక్షి ):-** ములుగు జిల్లా వెంకటాపురం మండలకేంద్రం లోని నూతన మండల పంచాయతీ అధికారిగా బొగ్గ నారాయణ, విధుల్లో చేరారు. బొగ్గ నారాయణ, గత పంచాయతీ ఎన్నికల్లో భద్రాచలం మండలంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి( ఫ్యాక్ ) గా బాధ్యతలు నిర్వహించి ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలో మల్టి జోన్ -1 పరిధిలో వెంకటాపురం మండలానికి నూతన మండల పంచాయతీ అధికారిగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంపివో బొగ్గ నారాయణ మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులతో, ప్రజా ప్రతినిధులతో సమన్వయం తో పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో త్రాగు నీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల అమలు, కూలీల వేతనాలు సకాలంలో చెల్లింపు, తదితర అంశాలపైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా చేరవేయడానికి కట్టుబడి ఉంటానని తెలిపారు.

## మండల ప్రజా పరిషత్ టైపిస్టుగా రఘునాథ్ రెడ్డి



**చెన్నారావుపేట, జూన్ 1 ( జనం సాక్షి):** మండల ప్రజా పరిషత్ కార్యాలయ టైపిస్టుగా రఘు నాథ్ రెడ్డి సోమవారం బాధ్యతలను తీసుకున్నారు. ఇక్కడ టైపిస్ట్ గా పని చేసిన రజిత ఖానా పురం మండల ప్రజా పరిషత్ కార్యాలయ టైపిస్టుగా బదిలీపై వెళ్ళింది. పర్వతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయ టైపిస్టుగా పనిచేస్తున్న రఘునాథరెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఆఫీస్ సబార్డినేట్లుగా ఇద్దరి బాధ్యతల స్వీకరణ... చెన్నారావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్లుగా ఇద్దరు బాధ్యతలను తీసుకున్నారు. ఖానాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేస్తున్న సాయిరాం, ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న నరేందర్ లు బదిలీ పై వచ్చి చెన్నారావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్లుగా బాధ్యతలను చేపట్టారు. చెన్నారావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేస్తున్న వీర్య నాయక్ వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్ళాడు.

## ధాన్యాన్ని తక్షణమే తరలించాలి



**నల్లబెల్లి, జూన్ 01 (జనంసాక్షి):** మండలంలోని రాంపూర్ ఐకెపి సెంటర్లో ఉన్న వరి ధాన్యాన్ని తక్ష ణమే తరలించాలని సిపిఐ నాయ కులు, రైతులు ఆర్డీవోకు వినతి పత్రాన్ని సోమవారం అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపి సెంటర్లో ఉన్న సుమారు 2500 బస్తాలను మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలు పడితే దాన్యం తడిసే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవలసి వస్తుందని తెలిపారు. అందుకు అధికారులు తక్షణమే స్పందించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వర్, బీసీ హక్కుల సాధన సమితి నాయకుడు సాంబయ్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

### వరంగల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దాసు.



**చెన్నారావుపేట, జూన్ 1 ( జనం సాక్షి):** ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దాసు అన్నారు. సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మొత్తం 6000 బస్తాలు ఉన్నాయని అందులో 1200 బస్తాలు కాంటాలు అయ్యాయని మిగతా 4800 బస్తాలు కాంటాలు కాలేదన్నారు. కాంటాలు కాని బస్తాలను వెంటనే హమాలీ కార్మికులతో కాంటాలు నిర్వహించాలని తెలిపారు. కాంటాలు అయిన బస్తాలను వెంటవెంటనే లారీల ద్వారా రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. ఐదు రోజులలో దాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం తిలక్ కుమార్ గౌడ్, సీసీ మంజుల, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కవిత, సుధ, తదితరులు పాల్గొన్నారు.

## నూతన డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ రమేష్

**నిర్మల్, జూన్01,(జనంసాక్షి)** నిర్మల్ జిల్లా నూతన డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను రాథోడ్ రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



## గ్రీన్ బడ్జెట్‌తో పచ్చదనానికి ప్రాధాన్యం: మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



**నిర్మల్ బ్యూరో, జూన్01(,జనంసాక్షి)** నిర్మల్ మున్సిపల్ బడ్జెట్‌లో ప్రత్యేకంగా గ్రీన్ బడ్జెట్ ప్రవేశపెట్టామని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు మున్సిపల్ శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సారంగాపూర్ మండలం చించొలి (బి) గ్రామ సమీపంలోని గండిరామన్న అర్బన్ పార్కులో. సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బందితో కలిసి పార్కును సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో ఇప్పటికే విస్తృత అవగాహన ఏర్పడిందన్నారు. నిర్మల్ పట్టణం మరియు శివారు ప్రాంతాల్లో పండ్ల, పూల మొక్కలను పెద్ద ఎత్తున నాటేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. పట్టణానికి ఆనుకుని అటవీ ప్రాంతం ఉండటం స్థానికుల అదృష్టమని అభిప్రాయపడ్డారు. అయితే కోతుల సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేక కుటుంబాల్లో మంకీ బైట్ ఇంజెక్షన్లు తీసుకున్న వారు ఉన్నారని పేర్కొన్నారు. కోతులను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టుకుని దూర ప్రాంత అటవీ ప్రాంతాల్లో వదిలివేయడంతో పాటు, కుటుంబ నియంత్రణ చర్యల కోసం కొన్ని కోతులను అటవీ శాఖకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. చికిత్స అనంతరం వాటిని సమీప ప్రాంతాల్లో కాకుండా దూర అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టాలని అటవీ శాఖను కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి,నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ,భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్ రావు పాటేల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది కౌన్సిలర్లు, ఫారెస్ట్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## షైన్ స్టూడియో బ్యానర్ పై సినిమా చిత్రీకరణ



**ములుగు/వెంకటాపూర్,జూన్01(జనం సాక్షి):-** షైన్ స్టూడియో బ్యానర్ పై రూపొందుతున్న "ప్రొడక్షన్ నెం.2 సినిమాను ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంలో సోమవారం మంత్రి సీతక్క తనయుడు సూర్య, రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ లు ముఖ్యఅతిథులుగా హాజరై క్లాప్ కొట్టి సినిమా షూటింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లా ప్రాంతంలో షైన్ స్టూడియోస్ బ్యానర్ పై సినిమాను చిత్రీకరించడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లా ప్రాంతంలో పుణ్య, పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నాయని వారు పేర్కొన్నారు. సమాజానికి చక్కటి సందేశాన్నిచ్చే సినిమాను ములుగు జిల్లా ప్రాంతంలో తీయడం సంతోషించదగ్గ విషయమని వారు పేర్కొన్నారు. అనంతరం వారు సినిమా యూనిట్ బృందంతో కలిసి రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు చిత్ర యూనిట్ సభ్యులతో పాటు అతిథులకు స్వామివారి ఆశీర్వచనాలను,తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు, వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు,ప్రొడ్యూసర్ వేణు యాదవ్,హీరో అజయ్,మూవీ డైరెక్టర్ నేరెళ్ల దేవేందర్,కో డైరెక్టర్ ఆర్య అరవింద్, లిరిక్స్ రైటర్ రాజ్ కుమార్,మూవీ ఎడిటర్ యూనిక్,డిఓపి తరుణ్,అసిస్టెంట్ డైరెక్టర్ లోకేష్, ప్రొడక్షన్ మేనేజర్,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతమ్,సిద్దు,రఘు,రాహుల్, రఘుపతి,శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సొంతింటి కల ఇందిరమ్మ ఇల్లు

### జంపాల ప్రభాకర్ సర్పంచ్ మచ్చపూర్



**గోవిందరావుపేట మే(. జనం సాక్షి ß. 01.06.26.**పేద ప్రజల సొంతింటి కల ఇందిరమ్మ గృహాలు అని మచ్చాపూర్ సర్పంచ్ జంపాల ప్రభాకర్ అన్నారు. ఆదివారం గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహాన్ని సర్పంచ్ లాంఛనంగా ప్రారంభించారు. సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహం వస్తుందని అది పలు విడుదలలో లబ్ధిదారులకు చెందుతుందని అన్నారు. పది సంవత్సరాల పరిపాలనలో పేదోడి ఇంటి విషయాన్ని మరిచిపోయిన పాత సర్కారుకు కాంగ్రెస్ పార్టీ ధీటుగా గృహాలు నిర్మింపజేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మరియు ఇప్పుడు పేదవాళ్లకు గృహాలు నిర్మించుకునే విధంగా సహకరించిందని అన్నారు. 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు, మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం, వంటి పథకాలు ఎంతో ప్రజాధరణ పొందుతున్నాయని అన్నారు. మంత్రి సీతక్క మన గ్రామపచాయతీ నీ ఉత్తమ గ్రామ పచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమసాని నారాయణస్వామి కుమ్మరి కుంట్ల రాజన్న మోతుకూరి రాజేశ్వరరావు వేములపల్లి కృష్ణస్వామి వేములపల్లి మల్లమ్మ వెంగళ రాజు చాగంటి సాగర్ లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కాటారం, జూన్ 1 (జనం సాక్షి ):**పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగ ణంలో మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఎఫ్ఓ నవీన్ రెడ్డి తదితరులు మొక్క లు నాటారు. అనంతరం ప్రజలు ఇండ్లలో పండ్ల మొక్కలు నాటేం దుకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భం గా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పర్యావరణ కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. చెట్లు తగ్గిపోవడం వల్ల వాతావరణంలో పెను మార్పులు వస్తున్నా యని, ఓజోన్ పొర దెబ్బతిని వాతావరణంలో వేడి పెరుగు తుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాలు పట్టణాల్లో పచ్చద నాన్ని పెంపొం దించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



# పేదవాడి ఆత్మగౌరవ ప్రతీక ఇందిరమ్మ ఇల్లు

## ప్రభుత్వానికి జర్నలిస్ట్ కృతజ్ఞతలు



**కుబీర్, జూన్ 01 (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ షేక్ గఫూరోద్దీన్ కు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ గఫూరోద్దీన్ మాట్లాడుతూ.. పేదవాడి సొంతింటి కలను నిజం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒక వరమని కొనియాడారు. గూడు లేని ఎందరో పేదలకు ఈ పథకం కొండంత ఆసరాగా నిలుస్తోందని పేర్కొంటూ, ప్రభుత్వానికి తన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తన గృహప్రవేశానికి విచ్చేసిన అధికారులను, ప్రజాప్రతినిధులను ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడి ప్రవీణ్, మాజీ సర్పంచ్ రాజన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి భూమేష్, ఆత్మ డైరెక్టర్ పి.నరేందర్ తదితరులు పాల్గొని గఫూరోద్దీన్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సమ్మె విరమించిన ఐకేపి వివోఏ లు



**దిలావర్పూర్, జూన్ 1, (జనం సాక్షి):** మండల కేంద్రంలో ఐకెపి వివోఏలు చేపట్టిన 14 రోజుల నిరవధిక సమ్మెకు ముగింపు పలికారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 14 రోజులుగా ఆందోళన కొనసాగించిన వివోఏలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో సమ్మెను విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర వివోఏల ప్రత్యేక ప్రతినిధి బృందం ఆదివారం రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి తమ సమస్యలు, డిమాండ్లను వివరించి పరిష్కరించాలని కోరింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఏపీఎం బోసికు వినతిపత్రం అందజేసిన వివోఏలు, తమ నిరవధిక సమ్మెను విరమించుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ, సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మె విరమణతో మండలంలోని సంబంధిత తిరిగి సాధారణ స్థితికి చేరుకోనున్నాయి.

# సిగ్నల్స్ రాక సతాయిస్తున్న జియో నెట్వర్క్

## ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



**బెల్లంపల్లి, జూన్ 1, (జనంసాక్షి)** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలోని జియో నెట్వర్క్ పని చేయక పోవడంతో వినియో గదారులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకు ంటున్నారు. వేళాపాల లేకుండా ఇష్టం వచ్చినట్లు జియో నెట్వర్క్ వస్తు పోతుండటంతో అసలు జియో నెట్వర్క్ కు ఏమైందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం మధ్యాహ్నం గాలిదుమారం సందర్భంగా కరెంటు పోతే జియో సిగ్నల్ కూడా పోయింది. రాత్రి ఒకటింపావుకు కరెంటు వచ్చినా సిగ్నల్స్ మాత్రం రాలేదు. ఒకవైపు కరెంటు ఉన్నా అప్పుడప్పుడు గంటల తరబడి సిగ్నల్స్ లో తీవ్ర అంతరాయం ఏర్పడటంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రీఛార్జ్ చేయడం ఒక సెకను ఆలస్యం అయితే వెంటనే నెట్వర్క్ నిలిపివేసే సదరు సంస్థ గంటల తరబడి నెట్వర్క్ రాకుంటే మాత్రం ఎందుకు మావద్ద ముక్కు పిండి రీఛార్జ్ చేయిస్తున్నారు అని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. మిగితా నెట్వర్క్ లు అన్ని సక్రమంగా పని చేస్తున్నప్పటికీ జియో సేవలు అంతంత మాత్రంగా మాత్రమే పని చేస్తున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జియో 5జీ సేవలు అందిస్తున్నామని చెప్పినప్పటికి 5జీ మాత్రం దాని ఇష్టం వచ్చినట్లుగా వస్తుందని, డెస్క్ టాప్ పై 5జీ చూపించినా కూడా కనీసం 3జీ నెట్వర్క్ కూడా ఉండటం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. జియో సేవల్లో అంతరాయంపై సదరు సంస్థ బాధ్యులు వెంటనే నాణ్యమైన సేవలు అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

# పంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

## చాగంటి వెంకటయ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



**తొర్రూరు జూన్ 1 (జనం సాక్షి):** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తొర్రూరు మండల శాఖ ధర్మారపు శ్రీనివాస్ గారిఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగినది అనంతరం ఎంపీడీవో వెంకటేశ్వర్లు గారికి వినతి పత్రం సమర్పించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి వెంకటయ్య హాజరై మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు గత 40 సంవత్సరాల పైబడి పని చేస్తూ గ్రామాలలో మంచినీటి సరఫరా వీధిలైట్లు ట్రాక్టర్ నిర్వహణ డంపింగ్ యార్డ్ అనేక పనులలో నిమగ్నమై గ్రామాలను సస్యశ్యామలంగా ఉంచుతున్న పంచాయతీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల తలరాత మారని పరిస్థితి ఉంది ఇప్పటికీ కనీస వేతనాలు అమలుకు నోచుకోని దుర్భర పరిస్థితి ఉంది ముఖ్యమంత్రి గారు పంచాయతీ శాఖను రివ్యూ చేస్తూ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తారీకు వేతనాలు చెల్లిస్తాహామి ఇవ్వడం జరిగినది వారికి యూనియన్ తరఫున ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల నైపుణ్యం లేని పనులు చేయడం వల్ల అనేకమంది చనిపోయిన పరిస్థితి ఉంది ఈ విధానం వల్ల ఉద్యోగ భద్రత కోల్పోయి తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి కనీస వేతనాలు 26000 గా నిర్ణయించే అమలు చేయాలని మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని రెండో పి ఆర్ సి లో పంచాయతీ ఉద్యోగులకు అవకాశం కల్పించాలని ఇందులో పనిచేస్తున్న కారో బార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని మరియు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పర్మనెంట్ చేయాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని దానకర్మలకు 30000 రూపాయలు చెల్లించాలని సౌకర్యాలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగింది రాబోయే కాలంలో గ్రామ పంచాయితీగా కార్మికుల సమస్యల పరిష్కరించని యెడల పెద్ద ఎత్తున ఉద్యమించి అవసరమనుకుంటే సమ్మెకు పోవడానికి కూడా వెనకాడమని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో తొర్రూర్ మండల శాఖ నాయకులు ధర్మారపు శ్రీనివాస్, రాగిరి వెంకన్న ,సింగారపు స్వప్న, ఎండి అజీత్ పాషా, కె.గూంశావాళి, బండి యాకయ్య, ఎంపిటియాకాయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 పోస్టర్ ఆవిష్కరణ



**హనుమకొండ, ప్రతినిధి జూన్ 1 (జనం సాక్షి)** :ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 గోడపత్రిక పోస్టర్ వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, హనుమకొండ,వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్య శారదలతో కలిసి కుడా కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యం వల్ల ఏర్పడుతున్న దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీలు, వీధి నాటకాలు, చర్చా వేదికలు, అవగాహన సదస్సులు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పర్యావరణ స్పృహను పెంపొందించాలని సూచించారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ఏక వినియోగ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, గాజు మరియు స్టీల్ బాటిళ్లు, విస్తర్లు వంటి సహజసిద్ధమైన, పునర్వినియోగ ఉత్పత్తులను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. స్వచ్ఛమైన, హరితమైన పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ మరియు జిల్లా సైన్స్ అధికారి ఎస్. శ్రీనివాస స్వామి, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జోనల్ ప్రయోగశాల పర్యావరణ శాస్త్రవేత్త జీమూత వాహన్ తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్ గ్రామానికి గర్వకారణం

- అగ్నివీర్‌గా ఎంపికైన ముగ్గురు

## యువకులకు ఘన సన్మానం



**నిర్మల్ రూరల్ జూన్ 1: (జనంసాక్షి)** సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అగ్నివీర్ సైనికులుగా ఎంపిక కావడం అభినందనీయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ వి. శోభారాణి, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు వి. సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నార ు.సోమవారం నిర్మల్ పట్టణంలోని ఇంద్రనగర్‌లోని వారి నివాసంలో అగ్నివీర్‌గా ఎంపికైన బర్మ మహేష్, అరిగెల లక్ష్మణ్, కొమ్ముల రామ్ చరణ్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా యువకులను ప్రోత్సహించి ఉన్నత స్థాయికి తీసుకువచ్చిన వారి తల్లిదండ్రులను కూడా ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువకులు ఎంతో కష్టపడి చదువుకుని భారత సైన్యంలో అగ్నివీర్‌లుగా ఎంపిక కావడం గ్రామానికే కాకుండా జిల్లా మొత్తానికి గర్వకారణమన్నారు. క్రమశిక్షణతో శిక్షణ పొంది దేశ రక్షణలో భాగస్వాములు కావడం గొప్ప అదృష్టమని, దేశ సేవకు అంకితభావంతో పనిచేసి మరింత మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మంజులాపూర్ వైస్ చైర్మన్ బర్మ గంగాదాస్, నాయకులు భూమన్న, అశోక్, యువకుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రచార ఆందోళనలు జయప్రదం చేయండి

## ఎంసిపిఐయూ పిలుపు



**బెల్లంపల్లి, జూన్ 1, (జనంసాక్షి)**ఈనెల 1 నుంచి 8 వరకు ఎంసిపిఐయూ చేపట్టే ప్రచార ఆందోళన కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఎంసిపిఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా నేడు ప్రజలు, రైతులు, కార్మికులు, ఆదివాసులు తీవ్రమైన సామాజిక, ఆర్థిక, పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆకాశన్నంటుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బనం, నిత్యవసర వస్తువుల ధరలు, పెరుగుతున్న దనిక, పేదల అంతరం, పారిశ్రామిక యూనిట్ల మూతపడటం, వ్యవసాయ సంక్షోభం, పర్యావరణ పరిరక్షణ లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలకు కారణమయ్యాయని అన్నారు. సామాన్య ప్రజలపై భారీ ఆర్థిక భారాన్ని మోపి, చమురు కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే పెట్రోల్, డీజిల్, సహజ వాయువు, ఎరువుల ధరల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆకాశన్నంటుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం నియత్రించాలి, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిని అందించి ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. అమెరికాతో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం నుండి వ్యవసాయ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలను మినహాయించాలన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హోదా కల్పించాలని, స్వామినాథన్ ఫార్ములా సీ2 ప్లస్ 50% ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేసేలా హామీ ఇస్తూ, పండ్లు, కూరగాయలతో సహా అన్ని వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధరను ప్రకటించాలన్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు చేసే ఏ కొనుగోలునైనా శిక్షార్హమైన నేరంగా పరిగణించాలన్నారు. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి, అమలు చేయకూడదన్నారు. కార్మికులకు, రైతులకు 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు 20 వేల రూపాయల చొప్పున సామాజిక పింఛన్ భద్రత కల్పించాలన్నారు. ఓటరు హక్కును పరిరక్షించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. మహిళలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులు, హత్యలను అరికట్టాలన్నారు. రాజకీయ అధికారంతో సంబంధం లేకుండా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. రాజ్యాంగ ప్రాథమిక హక్కులను పరిరక్షించి, రాజకీయ లబ్ధి కోసం ఈడి, సిబిఐ లాంటి ఇతర సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని అరికట్టాలన్నారు. నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ మూల్యాంకన కుంభకోణాలపై సంబంధిత మంత్రి రాజీనామా చేసేలా ఆదేశించి, దోషులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయూ నాయకులు ఆరేపల్లి రమేష్, రాజశేఖర్, రమేష్, ఖమ్మం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ



**గుడిహత్నూర్ (జనం సాక్షి)** గుడిహత్నూర్ మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రైతుల సంక్షేమం కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సామాజిక సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సంక్షేమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,మహేందర్ శాస్త్రి గంగారెడ్డి వెంకట్ రెడ్డి గడుగు పోచన్న రాథోడ్ సూర్య ప్రకాష్ ఐఖ సంజయ్ శివాజీ సుదర్శన్ పెందూర్ శంబు సుభాష్ సాగర్ రాజన్న రాందాస్ ప్రశాంత్ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించాలి

- ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ, ప్రతినిధి జూన్ 1 (జనం సాక్షి)** :ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ రవి ప్రజలు వ్యక్తిగతంగా సమర్పించిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తున్నందున ప్రతి వినతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల ఫిర్యాదులు, వినతులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సత్వర పరిష్కారం అందించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు కొండంత అండ సీఎంఆర్ఎఫ్: మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



**కుబీర్, జూన్ 01, (జనంసాక్షి):** ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తుందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి నివాసంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కుబీర్ మండలానికి చెందిన శేర అనసూయకు రూ. 13,000, నిస్తూర్ అక్షయకు రూ. 60,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను విఠల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను, ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుబీర్ సర్పంచ్ కందూరు సాయినాథ్, నాయకులు విజయ్ కుమార్, పెంటాజి, రాజన్న, సంతోష్, జావిద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఏపీవో నాగోరావుకు ఘన వీడ్కోలు



**ఏటూరునాగారం, జూన్ 01(జనంసాక్షి).**గిరిజన సంక్షేమ శాఖ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏటూరునాగారం అదనపు ప్రాజెక్టు అధికారి (ఏపీవో) నాగోరావు ఉద్యోగ పదవీ విరమణ పొందిన సందర్భంగా సోమవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నాగోరావు ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను కొనియాడారు.
కార్యక్రమంలో పీవో మాట్లాడుతూ, నాగోరావు తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో గిరిజనుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేశారని అన్నారు. శాఖ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి సేవలందిస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, గిరిజన నాయకులు, పాల్గొన్నారు.

### మేడారంలో అనుమానాస్పద మృతి

**ఎస్ ఎస్ తాడ్వాయి జూన్ 01(జనంసాక్షి).** ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారం ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో ఆదివారం 30-35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకు న్న నార్లాపూర్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, విష ప్రయోగం, గుండెపోటు లేదా ఇతర కారణాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడిని గుర్తించేందుకు పోలీసులు ఫొటోలు విడుదల చేశారు. ఫొటోలో ఉన్న వ్యక్తి వివరాలు తెలిసిన వారు వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి అని నార్లాపూర్ ఎస్ఐ కమలాకర్ విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చేందుకు ఎస్ఐ 8712670131, పోలీస్ స్టేషన్ 8712670132 నంబర్లను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఈదురుగాలులు, అకాల వర్షంతో భారీ నష్టం

### బాధితులను పరామర్శించిన సర్పంచ్ ఎండీ ఇబ్రహీం



**నేన్నెల్, జూన్ 1( జనం సాక్షి)**నేన్నెల్ మండల కేంద్రంలోని నేన్నెల గ్రామ పంచాయతీ 12వ వార్డు బొప్పారం గ్రామంలో ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులు, అకాల వర్షం కారణంగా తీవ్ర నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన మాదిరెడ్డి లింగయ్య ఇంటి పైకప్పు దెబ్బతినడంతో పాటు ఇంటి భాగం కూలిపోగా, నారా చంద్రయ్య ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. అలాగే గ్రామంలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.విషయం తెలుసుకున్న నేన్నెల గ్రామ సర్పంచ్ ఎండీ ఇబ్రహీం వెంటనే స్పందించి విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించేలా చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా స్తంభాలను బొప్పారానికి తరలించి పునరుద్ధరణ పనులను వేగవంతం చేశారు. అలాగే మండల రెవెన్యూ అధికారితో (ఎంఆర్వో) మాట్లాడి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పల్లె నర్సయ్య, స్వామి, కుమార్, నాగేష్, రమేష్, కిట్టు, మహేష్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచాలి

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, జూన్ 01(జనంసాక్షి)** చెన్నూరు రిజర్వాయర్ పనుల్లో వేగం పెంచాలని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు రిజర్వాయర్ పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ చెన్నూరు రిజర్వాయర్ పనులను త్వరిగత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజర్వాయర్ పనులు పూర్తయితే పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, సూర్యాపేట జిల్లాలోని తిర్మలగిరి మండలాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి పనులు నిర్ణీత సమయానికి పూర్తయితే ఈ ప్రాంతంలోని వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. పనుల్లో ణాణ్యత ప్రమాణాలు పాటించాలని, సంబంధిత శాఖ అదికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు.

# పేదింటి కళలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్



**గూడూరు,జూన్01(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని గూడూరు మెజార్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అన్నారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలోని చెంద్రుగూడెం గ్రామంలో రాచర్ల కృష్ణకుమారి ఇందిరమ్మ ఇల్లు నూతన గృహ ప్రవేశ ప్రారంభో త్స వానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ సునీత కొమ్మాల నాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు.ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ మహబూబాబాద్ నియోజకవర్గంలో పాటు గూడూరు మండలాన్ని ప్రత్యేక చురవతో అభివృద్ధి పనులు చేస్తున్నారని గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో రెండవ విడుదల ఇందిరమ్మ ఇళ్లను మరిన్ని కేటాయించి, అర్హులైన లబ్దిదారులను గుర్తించి అందజేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే నా దృష్టికి తీసుకువస్తే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ చంటి స్వామి,గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి,ఎండి రసూల్,టౌన్ కార్యదర్శి సూర శ్రీను,వార్డు మెంబర్లు ఇనుముల యకాంబరం,పత్తేం వెంకన్న, చీరబోయిన కుమార్,ఎంపీడీఓ సత్యనారాయణ,నాయకులు రూపురెడ్డి వెంకటరెడ్డి,రాస మల్ల రాములు,పేరాల సురేందర్, తంగళ్ళపల్లి సునీల్,గోనె శోభన్ బాబు, ఓర్సు రాజేందర్,ఎలమందల శ్రీను,చాంద్ పాషా,పంజరబోయిన శ్రీను, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు షాజహాన్, రాజేష్, హుస్సేన్,హోసింగ్ ఏఈ ప్రవీణ్,కార్యదర్శి తిరుమల,తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు ఇస్తే పింఛన్ లు ఇండ్లు ఇప్పిస్తా అనే వారిని నమ్మవద్దు

## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**గోవిందరావుపేట మే (.జనం సాక్షి. 0106.26.)** ప్రజలకు ఉచితంగా అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొందరు డబ్బులు ఇస్తే ఇప్పిస్తామని వచ్చిన వారిని నమ్మవద్దని లక్నవరం సర్పంచ్ భానోత్ సీతారాం నాయక్ ఉపాధి కూలీలకు సూచించారు. సోమవారం మండలంలోని దుంపలగూడెం గ్రామంలో ఉపాధి కూలీల శిబిరం వద్దకు వెళ్లి ఎండలు పనిచేస్తున్న కూలీలకు సర్పంచ్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ కూలీలతో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కొందరు వ్యక్తులు డబ్బులు ఇస్తే ఇండ్లు ఇస్తాం పింఛన్లు ఇప్పిస్తాం అంటూ వచ్చేవారిని నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని అన్నారు. అర్హులైన పేదవారికందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, అర్హులై ఉండి పథకం రాకపోతే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. మీడియేటర్లను నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని మరోమరు సూచించారు. ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలని వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఉపాధి పనులు ఎండ మొదట ముందే పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లాలని అన్నారు.

# పలువురిని సన్మానించిన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవ కమిటీ

**వరంగల్ మండలం, జూన్ 01 (జనం సాక్షి)** గోపాలస్వామి దేవాలయం –బ్రహ్మోత్సవ కమిటీ మరియు మహాత్మ గాంధీ రోడ్ పరపతి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు మరియు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నందు భగవద్గీత రికార్డు హోల్డర్ మాధవి లకు సన్మానం.ఈ మధ్యన గీతా పఠనంలో రికార్డు సమయంలో భగవద్గీత మొత్తం ఆశువుగా 57 ని. 54 సెకండ్ లలో చదివి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన కొత్త మాధవి వెంకట కృష్ణ ని ఘనంగా సన్మానించిన శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవ కమిటీ మరియు మహాత్మ గాంధీ రోడ్ పరపతి సంఘం. వరంగల్ బార్ అసోసియేషన్ కు జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ప్రముఖ న్యాయవాది చకిలం ఉపేందర్ ని మైసూర్ దత్త పీఠం లో గోల్డ్ మెడల్ సాధించిన కలికోట వర్ష వినోద్ గారిని ఈ సందర్భంగా రెండు కమిటీలు సంయుక్తంగా ఘనంగా సన్మానించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రముఖ సమాజ సేవకులు ఆధ్యాత్మిక చింతనా పరులు మార్గదర్శకులు శ్రీమాన్ సౌమిత్రి లక్ష్మణా చార్యులు మరియు హనుమకొండ వికాస తరంగిణి బాధ్యులు ఉమాదేవి విచ్చేసారు.లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ రికార్డు సాధించిన మాధవిని అభినందిస్తూ వారి స్ఫూర్తితో మహిళలు ముందుకు రావాలని అన్నారు.ఇంకా మాట్లాడుతూ యం.జి రోడ్ అనడం మాని మహాత్మా గాంధీ రోడ్ అని పిలవాలని తద్వారా యువత వచ్చే తరాలకు మహాత్మ గాంధీ గురించి ఆసక్తి ఏర్పడుతుంది అన్నారు.వికాస తరంగిణి బాధ్యులు శ్రీమతి ఉమాదేవి మాట్లాడుతూ



గీతా పఠనం ప్రాముఖ్యతను తెలియజేసారు.సన్మాన గ్రహీత ప్రముఖ న్యాయవాది చకిలం ఉపేందర్ మాట్లాడుతూ బాధ్యులను అభినందించారు. న్యాయం సైతం గీతలో అత్యద్భుతంగా శ్రీకృష్ణుడు బోధించాడని అన్నారు.కార్యక్రమానికి ప్రముఖ వ్యాపార వేత్త ఆధ్యాత్మిక చింతనా పరులు వేణు గోపాల స్వామి దేవాలయం చైర్మన్ మహాత్మ గాంధీ రోడ్ పరపతి సంఘం అధ్యక్షులు ఇరుకుల్ల రమేశ్ అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో ఇంకా ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, కృష్ణమాచార్యులు కార్యదర్శి అకినపల్లి సత్యనారాయణ, కోశాధికారి బెజుగం రజినీకాంత్, ఎలాగందుల రమేష్, గంగిశెట్టి హరినాథ్,పాలరపు పనేష్, దివ్వెల శ్రీనివాస్, పుల్లూరు ప్రవీణ్, పసునూరి శ్రీనివాస్, ఉమామహేశ్వర్ గురుస్వామి, గౌరిశెట్టి శ్రీనివాస్, యిరుకుల్ల నాగేశ్వర్ రావు, సిరుపా మాధవ్,వెనిశెట్టి త్రిమూర్తి, పబ్బ కిషోర్, చకిలం వెంకటేశ్వర్లు, జులకంటి రమేష్ మరియు మహిళా భక్తబృందం పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆర్ఐటిఐ డ ఏటీసీ ప్రవేశాల అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన

## ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టొప్పో.

**ఏటూరునాగారం, జూన్ 01(జనంసాక్షి).** 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఆర్ఐటిఐ (రూరల్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ) మరియు ఏటీసీ (అప్రెంటిస్ షిప్ ట్రైనింగ్ సెంటర్ ) ప్రవేశాల అవగాహన పోస్టర్లను ఐటిడిఎ ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో అధికారికంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో ప్రభుత్వ ఆర్ఐటిఐ ఏటూరునాగారం ప్రిన్సిపాల్ ఎస్ జగన్మోహన్ రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ బి యాదగిరి, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ వి మువీన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ బి విక్రమ్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా గిరిజన యువతకు ప్రభుత్వ ఆర్ఐటిఐ మరియు ఏటీసీ సంస్థల్లో అందుబాటులో ఉన్న



వివిధ వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి కోర్సుల గురించి సమాచారం అందించడంతో పాటు, శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్య ఆధారిత విద్య ద్వారా విజయవంతమైన ఉపాధి మరియు కెరీర్ అవకాశాలను పొందేలా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.అర్హత గల విద్యార్థులు మరియు యువత ప్రభుత్వ ఆర్ఐటిఐ డ ఏటీసీ సంస్థల్లో ప్రవేశాలు పొందేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో పిలుపునిచ్చారు.

# ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు



**దిలావర్ పూర్, జూన్1, (జనం సాక్షి):** మండలంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఈ కార్యక్రమానికి ఎంపీడీవో అరుణ రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అరుణ రాణి మాట్లాడుతూ పేదల గృహ కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. బన్స పెల్లీ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు గ్రామ లబ్ధిదారులు గడ్డం రజిత, గడ్డం ముత్తవ్వ, మాస్త సుశీల, స్వప్న గృహప్రవేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్లు ప్రతి పేదవాడికి సొంతింటి కల సహకారం చేసుకోవడానికి ప్రభుత్వం పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను పూర్తిచేసుకుని గృహప్రవేశాలు నిర్వహించారు . బన్సపెల్లి గ్రామానికి బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి సౌందర్యకు గ్రామ ప్రజలు, సర్పంచ్ మల్లేష్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి



**మల్హార్,జూన్ 01(జనంసాక్షి)** మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు చినరాజయ్య(47) పారిశుధ్య కార్మికుడు వడదెబ్బతో మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది.గ్రామస్తులు, కుటుంబ సభ్యుల పూర్తి కథనం మేరకు ఇందారపు చిన రాజయ్య కొన్ని సంవత్సరాలుగా తాడిచెర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిద్య కార్మికునిగా పనిచేస్తున్నాడు. రోజులాగే సోమవారం ఉదయం విధులు నిర్వహిస్తుడంగా వడదెబ్బ తగిలి అస్వస్థకుగురై తలతింపు తుందని చెప్పి అక్కడికి అక్కడె మృతి చెందాడు అని తెలిపారు. మృతుడు ఇందారపు చిన రాజయ్య నిరుపేద దళిత కుటుంబం ఆయన మృతితో కుటుంబ రోడ్డునపడింది. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పరకాల మున్సిపల్ కమిషనర్గా పోతురాజు పవన్

**పరకాల, జూన్ 1 (జనం సాక్షి):** పరకాల మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా పోతురాజు పవన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రోజున పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



